క్లుప్తంగా

ప్రారంభమైన ఓపెన్ ఇంటర్ పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్, బాలికల పాఠశాల, బాలుర, పెర్కిట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో ఓపెన్ ఇంటర్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించనున్నట్లు కమిటి సభ్యులు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాక్లూర్: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి డబ్బులు మంజూరైన లబ్ధిదారులకు ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు చెక్కులను అందజేశారు. మండల కేంద్రానికి చెందిన బి సత్యెమ్మకు రూ.12 వేలు, కృష్ణానగర్‌కు చెందిన నాగేశ్వర్‌రావుకు రూ.60 వేలు మంజూరయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సూచన మేరకు ఆ చెక్కులను వెంకటేశ్వర్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు జాఫర్, అలీమ్, స్వామి, శ్రీను, రాజు, పార్టీ మీడియా మండల కన్వీనర్ జైల్‌సింగ్ పాల్గొన్నారు.

'ఉన్నత పదవులు పొందడం గర్వకారణం'



బాల్కొండ: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కో - చైర్మన్ ఓ.రమేశ్‌ను ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో గ్రామ పరిరక్షణ సమితి సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఉన్నత పదవులు పొందడం గర్వంగా ఉందన్నారు.

కోటగిరి హైస్కూల్‌కు అవార్డు



రుద్రూర్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కోటగిరి హైస్కూల్.. రోడ్ సేఫ్టీ ఛాంపియన్-2025 అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును హైద్రాబాద్‌లో శనివారం రాత్రి పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు బర్ల సాయిలు, ఎండీ. అతిక్ అందుకున్నారు. పాఠశాలకు అవార్డు రావడం పట్ల హెడ్‌మాస్టర్, ఎంఈవో నాదెండ్ల శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్, టీఎస్పీఎస్ మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సన్‌షైన్ హాస్పిటల్స్ గ్రూప్ అధినేత గురువారెడ్డి, నటుడు మురళీమోహన్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి వీడ్కోలు

ఖలీల్‌వాడి: జిల్లా జడ్జి సునీతా కుంచాల బదిలీపై పెద్దపల్లి జిల్లా కోర్టుకు వెళ్తుండటంతో నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది ఆమెను శాలువా, మెమోంటోతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి సునీత మాట్లాడుతూ.. సివిల్ కోర్టు సిబ్బంది కోర్టులో దాఖలైన దావాలను చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

నిబంధనలు బేఖాతర్..!

- పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న బిల్డర్లు
- ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కాలనీవాసులు



రోడ్డు పక్కనే బిల్డర్ చేపట్టిన ఇంటి నిర్మాణం

మాక్లూర్: నగరపాలక సంస్థ నిబంధనలను తుంగలో తొక్కుతూ మండలంలోని మాణిక్‌భండార్ శివారు ఆర్టీసీ కాలనీ, 3వ డివిజన్‌లో కొందరు బిల్డర్లు ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు కాలనీవాసుల నుంచి వస్తున్నాయి. నగరపాలక సంస్థ నుంచి సెట్ బ్యాక్ అనుమతి తీసుకోకుండా కొందరు బిల్డర్లు ఇళ్ల నిర్మాణం చేయటం వల్ల రోడ్లు ఇరుకుగా మారటమే కాకుండా డ్రైనేజీ కాల్వలు కూడా మాయం అవుతున్నాయి. ఫలితంగా మురికినీరు నివాసపు ఇళ్లు, రోడ్లపైకి వస్తుందని కాలనీవాసులు అంటున్నారు. ఈ విషయమై జూన్ 25- 2024, ఆగస్టు 26- 2024న మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని కాలనీ ప్రెసిడెంట్ రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌పై నమ్మకంపోయి తిరిగి ఆగస్టు 30, 2024న కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి పనులు నిలిపివేసిన సందర్భంలో బిల్డర్లు సెట్ బ్యాక్ అనుమతి తీసుకున్నారు. తర్వాత బిల్డర్లు రోడ్లను కబ్జా చేస్తూ మళ్లీ నిర్మాణాలు చేపట్టినట్టు కాలనీ ప్రెసిడెంట్ తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆర్టీసీ కాలనీ, 3వ డివిజన్‌లో బిల్డర్లు చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవటంలో ఇంత జాప్యమా..



కాలనీలో బిల్డర్లు ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి కాలనీవాసులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే అధికారులు సమస్య పరిష్కరించటంలో ఇంత జాప్యం చేస్తారని తాను అనుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడ్డగోలుగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లపై చర్యలు తీసుకోవాలి.

– సురేష్ రాజేందర్, ఆర్టీసీ కాలనీ, 3వ డివిజన్ ప్రెసిడెంట్

కొత్త మండలాల్లో ఠాణాల జాడేది..?



బోధన్‌టౌన్(బోధన్): గత ప్రభుత్వ హయాంలో పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన మండలాల్లో ఠాణాల జాడే కరువైంది. పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నూతన మండల కేంద్రాలకు 10 కిలో మీటర్ల దూరంలో పోలీస్ స్టేషన్‌లు ఉండడంతో రాత్రి వేళలో ఇబ్బందులు తప్పడం లేదు. సాలూర, పోతంగల్ వంటి మండల కేంద్రాలు రాష్ట్ర సరిహద్దులుగా ఉన్నాయి. మండలాల్లో మంజీరా నది పరివాహక ప్రాంతం ఉండటంతో ఇసుక అక్రమ రవాణాలకు అనుకూలంగా మారింది. ఇసుక అక్రమ రవాణాను నూతన మండలాల్లోని గ్రామస్తులు అడ్డుకున్నా పోలీసులు వచ్చే సమయానికి పరిస్థితులు మారిపోతున్నాయి. ఇసుకతో పాటు మట్కా, మద్యం, గంజాయి రవాణాతో పాటు దొంగతనాలకు అనుకూలంగా మారుతోంది.

ఆ ఊసే లేదు..

గత ప్రభుత్వ హయంలో బోధన్ డివిజన్, బాన్సువాడ నియోజకవర్గంలో నూతనంగా మోస్రా, చందూర్, పోతంగల్ మండలాలతో పాటు సాలూరను సైతం మండలముగా ఏర్పాటు చేశారు. మండలం అయితే ఏర్పాటు చేశారు గానీ ఇప్పటికీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయలేదు. కనీసం మండల కేంద్రంలో అవుట్ పోస్టును కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికి కాస్త ఇబ్బందులు తప్పడం లేదు.

ఫిర్యాదు చేయాలంటే 10 కిలో మీటర్లు పోవాల్సిందే...

నూతనంగా ఏర్పాటైన మండలాల్లోని గ్రామాల ప్రజలకు సమస్య వస్తే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే 10 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చందూర్, మోస్రా మండలాల ప్రజలకు సమస్య వస్తే వర్ని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలి. సర్కిల్ సారుతో మాట్లాడాలంటే రుద్రూర్ మండల కేంద్రానికి రావాల్సిందే. పోతంగల్ మండలంలోని ప్రజలు కోటగిరికి సీఐతో మాట్లాడాలంటే రుద్రూర్‌కు, సాలూర మండల ప్రజలు పోలీస్ స్టేషన్, సీఐ వద్దకు రావాలంటే బోధన్‌కు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నత అధికారులు స్పందించి నూతన మండలాల్లో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మండలాల ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి



ముగింపు కార్యక్రమానికి హాజరైన సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌టౌన్(బోధన్): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని, వెంటనే డయల్ 101కు ఫోన్ చేయాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది అనేక చర్యలు తీసుకుంటున్నారని, దీనిలో భాగంగానే అగ్ని మాపక వారోత్సవాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అపార్ట్‌మెంట్స్, ఆస్పత్రులు, పాఠశాలల్లో, సినిమా థియేటర్లలో అగ్నిమాపక నివారణ చర్యలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, అగ్నిమాపక శాఖ బోధన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులోని మంటలను అరికట్టండి



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ శివారు మున్సిపల్ డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. ఆదివారం పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలను మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణతో కలిసి పరిశీలించారు. జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

మట్టిస్నానంతో చర్మవ్యాధులు దూరం



మట్టిని ఒంటికి పూసుకుంటున్న యోగ సాధకులు

ఎడపల్లి(బోధన్): మట్టి స్నానం వల్ల గజ్జి, తామర, సొరియాసిస్, చికెన్ పప్స్, పూత, చుండ్రు, ఇలా ఎన్నో రకాల చర్మ వ్యాధులు నయమవుతాయని యోగా శిక్షణ నిర్వాహకుడు సుర కిరణ్ అన్నారు. ఆదివారం అలీసాగర్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మట్టిస్నానం చేశారు. పుట్ట మట్టి, ఆవు పేడ, ఆవు పాలు, ఆవు పెరుగుతో పాటు ఉత్తరేణి, గుంట కరగడ, తులసి, వేప, తంగిడి, కలబంద ఇలా ఎన్నో రకాల మూలికలను మట్టిలో కలిపి ఒంటికి పూసుకొని గంటసేపు ఎండలో నిలబడి స్నానం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది యోగా సాధకులు హాజరయ్యారు. యోగా సాధకులు ఆంజనేయులు, భూమా గౌడ్, సంతోష్, మాజీ ఎంపీటీసీ ఆకుల సురేష్, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



రుద్రూర్ కేజీబీవీ

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(ఇంగ్లీష్ మీడియం)లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రత్యేకాధికారిణి బి.శ్యామల తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు స్కూల్ బోనాఫైడ్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ, జనన, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతపర్చాలని పేర్కొన్నారు. అర్హత, సీట్ల కేటాయింపులో అనాథలు, తల్లి, తండ్రి లేని వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పేద, మధ్య తరగతి చెందిన వారు, స్కూల్ నుంచి మూడు నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న రుద్రూర్ మండలానికి చెందిన పరిసర గ్రామాల విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు.

కల్లాలే క్రీడా మైదానమైన వేళ..



నాగంపేట్‌లోని కల్లాల్లో క్రికెట్ ఆడుతున్న యువకులు

బాల్కొండ: పల్లె ప్రగతిలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. పల్లెల్లో క్రీడల పట్ల ఆసక్తి గల యువకులు, చిన్నారులు కల్లాలనే మైదానాలుగా చేసుకుని క్రీడలు ఆడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల వద్ద కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. కాని బోర్డులు పెట్టి హంగామా చేశారు. ఇప్పటికి ఆ ప్రాంగణాలు క్రీడలకు ఉపయోగపడటం లేదు. ప్రస్తుత ప్రభుత్వంలోని పాలకులైనా స్పందించి క్రీడా ప్రాంగణాల వద్ద మైదానాలను సిద్ధం చేయాలని యువకులు కోరుతున్నారు. అలాగే క్రీడా సామగ్రిని సమకూర్చాలని వేడుకుంటున్నారు.

జయంత్యోత్సవ సభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బోధన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావు పూలే, బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఈ నెల 30న బోధన్‌లో నిర్వహించనున్న మహనీయుల జయంత్యోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ డివిజన్ కన్వీనర్ న్యాయవాది నీరడి ఈశ్వర్ మాట్లాడుతూ.. సభకు ముఖ్య అతిథులుగా దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేబీ రాజు, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రొఫెసర్ ప్రసన్న హరిక్రిష్ణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కమిటీ డివిజన్ కో-కన్వీనర్లు నీరడి రవి, సింగాడే పాండు, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఆర్మూర్ రోటరీ క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ.. 'వనజీవి రామయ్య కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. నేటి యువతరం ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యదర్శి రాస ఆనంద్, గౌరవ సభ్యుడు కాంతి గంగారెడ్డి, చరణ్ రెడ్డి, విజయసారథి, పట్వారి గోపి కృష్ణ, రాధా కిషన్, ప్రాజెక్ట్ చైర్మన్ పట్వారి తులసి, ఖాందేశ్ సత్యం, మారుతి, నరేష్ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్



జాన్కంపేట్ ఐబీసీ చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు



మోతె జీసస్ గాస్పల్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

వేల్పూర్: వేల్పూర్ మండల గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ జరుపుకున్నారు. యేసు క్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున మరణించి, తిరిగి మూడో రోజున ఆదివారం పునరుత్థానుడై తిరిగి లేచాడని భావించి ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. ఈస్టర్ ప్రత్యేకతను తెలిపే విధంగా పాటలు పాడారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్లు ఈస్టర్ సందేశం వినిపించారు. మోతెలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్మల్‌లో..



వెల్మల్‌లో ప్రవచిస్తున్న పాస్టర్ విజయకుమార్

నందిపేట్(ఆర్మూర్): వెల్మల్‌లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో ప్రార్థనలు చేశారు. క్రీస్తు పునరుత్థానం గురించి పాస్టర్ విజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

ఓవర్ లోడ్.. అతి వేగం..

- ఎస్సారెస్పీ నుంచి నల్ల మట్టి తరలింపు సమయంలో నిర్లక్ష్యంగా వాహనాల డ్రైవింగ్
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



మెందోరా మండలం వెల్కటూర్ మీదుగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న నల్ల మట్టి డంపర్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటికే కాదు.. నల్ల మట్టికి కూడా భారీ గిరాకీ ఉంది. దీంతో గత పక్షం రోజుల నుంచి వందల టిప్పర్లు, డంపర్లతో నల్ల మట్టిని తరలిస్తున్నారు. కాని నల్ల మట్టి తరలింపు సమయంలో నల్లమట్టి వ్యాపారులు, డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్ల మట్టిని ఎక్కువ ట్రిప్పులు తరలించాలనే ఆలోచనతో అతి వేగంగా తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. గతంలో బాల్కొండ మండల కేంద్ర శివారులో ఓవర్ లోడ్ వస్తున్న నల్ల మట్టి టిప్పర్ బోల్తా పడింది. అంతకు ముందు ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో జాతీయ రహదారి-44పై బైక్‌పై వెళ్తున్న వారిని ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది.

ఎక్కువ ట్రిప్పులు తరలించాలనే ధ్యాసే..

నల్ల మట్టిని ఎక్కువ ట్రిప్పులు తరలించాలనే ధ్యాసలో వేగాన్ని మరిచి పోయి నడుపుతుండటమే కారణమవుతుంది. రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో అధికారులు కూడా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఇష్టారీతిలో వాహనాలను నడుపుతున్నారు. మరో నెలన్నర రోజుల పాటు నల్లమట్టి తరలింపు జరుగుతుంది. హైదరాబాద్ నుంచి వాహనాలను తీసుకు వచ్చి నల్లమట్టి వ్యాపారులు దందాను కొనసాగిస్తున్నారు. వాహనాలను వేగంగా నడపడం వల్ల ప్రయాణికులు భయపడుతున్నారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పెద్ద పెద్ద మట్టి పెళ్లల లోడుతో వెళ్లే టిప్పర్ల పక్క నుంచే వెళ్లే ప్రయాణికులపై కూడ పడే ప్రమాదం కూడా ఉంది. అధికారులు స్పందించి నల్ల మట్టి తరలింపు వాహనాదారులకు తగు సూచనలు చేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేగాన్ని నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45 -మధురం-1.55
	జాక్(తెలుగు)-4.50-డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

- మహారాష్ట్ర ప్రాంత మఠాధిపతి సద్గురు సిద్ధదయాళ్ శివాచార్య మహరాజ్
- బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో ప్రారంభమైన అఖండ శివనామ సప్తాహం

వీరశైవ ధర్మాన్ని ఆచరించాలి



అఖండ శివనామ సప్తాహం శిబిరంలో కూర్చుకున్న వీరశైవ సమాజ్ మహిళలు

బోధన్: ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో వీరశైవ ధర్మాన్ని ఆచరించాలని మహారాష్ట్ర ప్రాంత బేట్ మోగ్రా వీరశైవ మఠాధిపతి సద్గురు సిద్ధదయాళ్ శివాచార్య మహరాజ్ ప్రబోధించారు. నిత్యం శివ నామస్మరణం చేయాలన్నారు. ఆధ్యాత్మిక జీవన విధానం వల్ల మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తోందన్నారు. వీరశైవ సమాజ్(వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్) బోధన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన ద్విదశాబ్ది అఖండ శివనామ సప్తాహం ప్రారంభ కార్యక్రమంలో మఠాధిపతి పాల్గొని భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శివనామ సంకీర్తన, పరమ రహస్య గ్రంథ సామూహిక పారాయణ కార్యక్రమాలు కొనసాగాయి. వీరశైవ సమాజ్ మహిళలు గ్రంథపారాయణంలో కూర్చుకున్నారు. మంగళ హారతి అనంతరం అన్నదానం చేశారు.

అపూర్వ సమ్మేళనం



ముప్కాల్ పాఠశాల 2001-02 బ్యాచ్ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



గురువులతో బాల్కొండ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ విద్యార్థులు